RNI No: TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:53 | జనవరి 31, 2026 | వెల: రూ.3-00

సిగాచి ఫార్మా ప్రమాద బాధితుల
**పరిహారంపై హైకోర్టు ఆగ్రహం**



2లో

# వనమెల్లి.. ప్రణమిల్లి!



**నిలువెత్తు 'బంగారం'తో పోటెత్తుతున్న భక్తకోటి**

2లో



- మేడారంలో కొనసాగుతున్న గిరిజన జాతర
- గేట్ల వద్దే తల్లులకు మొక్కుల సమర్పణ
- ఎక్కడ చూసినా జనమే.. జనం
- తల్లులను దర్శించుకుంటున్న ప్రముఖులు
- కిక్కిరిసిపోయిన జంపన్నవాగు
- ఏఐ నిఘాలో 'దక్షిణ భారత కుంభమేళా'
- వాహనాల రద్దీతో భారీగా ట్రాఫిక్ జామ్
- ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న మంత్రి సీతక్క
- నేడు తల్లుల వన ప్రవేశంతో జాతర ముగింపు

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర చారిత్రాత్మక ముగింపు ఘట్టానికి చేరుకుంది. అడవి తల్లులైన సమ్మక్క, సారలమ్మలతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరడంతో తాడ్వాయి అరణ్యం భక్తజన సంద్రంగా మారింది. కోట్లాది మంది భక్తులు తమ ఆరాధ్య వన దేవతలకు ప్రణమిల్లారు. బంగారం (బెల్లం) సమర్పించుకుంటూ ఆధ్యాత్మిక తన్మయత్వంలో మునిగిపోతున్నారు. ఇసుకవేస్తే రాలనంత జనంతో గద్దెల ప్రాంగణం, కిలోమీటర్ల మేర భక్తులతో జంపన్నవాగు కిటకిటలాడుతుండగా.. నేడు సాయంత్రం సూర్యాస్తమయం వేళ దేవతలు తిరిగి వనప్రవేశం చేయడంతో ఈ అపురూప వేడుక అధికారికంగా ముగియనుంది. గవర్నర్ మొదలుకుని విదేశీ ప్రతినిధుల వరకు అందరూ వనదేవతల సేవలో తరిస్తుండగా, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఏఐ కెమెరాలు, డ్రోన్లు, 30 వేల మంది పోలీసులతో అత్యంత పకడ్బందీగా భద్రతను పర్యవేక్షిస్తోంది. దారులన్నీ మేడారం వైపే పయనిస్తుండటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయినా, తల్లుల దర్శనం కోసం భక్తులు ఆకలిదప్పులను మరిచి భక్తి పారవశ్యంతో ముందుకు సాగుతున్నారు.

## ఫిబ్రవరి 1న విచారణకు హాజరు కావాల్సిందే..

**కేసీఆర్‌కు మరోసారి నోటీసులు జారీ చేసిన సిట్**

- నందినగర్‌లోని ఇంటి గోడకు నోటీసులు అంటించిన అధికారులు
- ఫామ్‌హౌస్‌లో విచారణకు నో..
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు



వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో

తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు నిర్ణయాత్మక దశకు చేరుకుంది. బీఆర్ఎస్ కీలక నేతల విచారణ అనంతరం, ఈ కేసులో విచారణాధికారులు ఇప్పుడు నేరుగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై దృష్టి సారించారు. ఫిబ్రవరి 1న విచారణకు హాజరుకావాల్సిందే నని స్పష్టం చేస్తూ, నందినగర్ నివాసానికి నోటీసులు అంటించడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. మినహాయింపులకు కాలం చెల్లిందని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సిట్ సంకేతాలివ్వడంతో ఇప్పుడు అందరి కళ్లు ఫిబ్రవరి 1న జరగబోయే విచారణపైనే ఉన్నాయి.

2లో




## సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వ శిక్షణ పూర్తి

'లీడర్‌షిప్ ఇన్ ద 21వ శతాబ్దం' ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ ముగింపు

- శీతల వాతావరణంలో రోజంతా అకడమిక్ సెషన్లు
- 'తెలంగాణ రైజింగ్' దృక్పథానికి అంతర్జాతీయ గుర్తింపు

2లో

## తెలంగాణ జలాలను ఏపీకి దోచిపెడుతున్నారు

బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరోపణ



## మేడారంలో నిరుద్యోగుల వినూత్న నిరసన

జాబ్ నోటిఫికేషన్ల కోసం ఫ్లెక్సీ ఏర్పాటు

2లో

## వన దేవతల చెంత తెలంగాణ గవర్నర్

- సమక్క, సారలమ్మ తల్లులను దర్శించుకున్న జిష్ణు దేవ్ వర్మ దంపతులు
- మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు

2లో



# ఫిబ్రవరి 1న.. విచారణకు హాజరు కావాల్సిందే

వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో



- కేసీఆర్ కు మరోసారి నోటీసులు జారీ చేసిన సిట్
- ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గోడకు అంటించిన అధికారులు
- ఫామ్‌హౌస్‌లో విచారణకు నో..
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

తెలంగాణను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే ఈ కేసులో బీఆర్ఎస్ కీలక నేతలు హరీశ్ రావు, కేటీఆర్, సంతోష్ రావులను సిట్ అధికారులు విచారించారు. తాజాగా ఈ కేసులో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విచారించేందుకు సిట్ నోటీసులు జారీ చేసింది. రెండు రోజుల క్రితం సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయగా, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ జరుగుతుండటంతో విచారణకు వాయిదా వేయాలని ఆయన కోరారు. దీనికి సిట్ అధికారులు ఒకసారి మాత్రమే మినహాయింపు ఇచ్చారు. ఈసారి ఎలాంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేసిన సిట్, ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని కచ్చితంగా పేర్కొంది. శుక్రవారం రాత్రి బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసానికి వెళ్లిన అధికారులు, అక్కడ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో గోడకు నోటీసులు అంటించి వెళ్లారు.

**ఫామ్‌హౌస్‌లో విచారణకు నిరాకరణ**

ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో విచారణ నిర్వహించాలని కేసీఆర్ చేసిన విజ్ఞప్తిని సిట్ తిరస్కరించింది. అసెంబ్లీ రికార్డులు, ఎన్నికల అఫిడవిట్‌లలో నందినగర్‌నే అధికారిక నివాసంగా పేర్కొన్నందున అక్కడే విచారణ జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. సున్నితమైన ఎలక్ట్రానిక్ పరికరాలు, భౌతిక ఆధారాలను ఫామ్‌హౌస్‌కు తరలించడం సాధ్యం కాదని తెలిపారు.

**చార్జిషీట్‌కు సిద్ధమవుతున్న సిట్**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తల ఫోన్లను చట్టవిరుద్ధంగా ట్యాప్ చేశారన్న ఆరోపణలపై ఈ విచారణ కొనసాగుతోంది. కేసీఆర్ విచారణ పూర్తైన వెంటనే సిట్ తుది ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశముంది. సెక్షన్ 160 సీఆర్పీసీ కింద జారీ చేసిన నోటీసులు పూర్తిగా చట్టబద్ధమైనవని పోలీసులు స్పష్టం చేశారు. కాగా, ఒక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిని ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారించడం తెలంగాణ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఫిబ్రవరి 1న జరిగే విచారణపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ విచారణలో కేసీఆర్ ఇచ్చే స్టేట్‌మెంట్‌లు కేసు దిశను మార్చే అవకాశం ఉందని రాజకీయ, న్యాయ వర్గాలు చర్చిస్తున్నాయి.

# సిగాచి ఫార్మా ప్రమాద బాధితుల పరిహారంపై హైకోర్టు ఆగ్రహం

వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి



సంగారెడ్డి జిల్లా సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పరిహారం పంపిణీలో స్పష్టత లేకపోవడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. “పరిహారం ఎంత ప్రకటించారు? ఎంత చెల్లించారు? ఎప్పుడు ఇస్తారు?” అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. గతేడాది పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో 56 మంది మృతి చెందగా, 8 మంది ఆచూకీ లభించలేదని, 28 మంది గాయపడ్డారని కోర్టుకు తెలియజేశారు. బాధితులకు తక్షణమే పరిహారం ఇవ్వాలని కోరుతూ బాబురావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అలాగే హైదరాబాద్ ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలిని సుమోటోగా ప్రతివాదులుగా చేర్చింది.




# మేడారంలో నిరుద్యోగుల వినూత్న నిరసన

## జాబ్ నోటిఫికేషన్ల కోసం ఫ్లెక్సీ ఏర్పాటు

వేద న్యూస్, మేడారం

ప్రభుత్వం జాబ్ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని ఆరోపిస్తూ నిరుద్యోగ యువత మేడారం జాతరలో వినూత్న నిరసన చేపట్టారు. ఉద్యోగాలు లేక జాతరలో షాపు పెట్టుకున్నామని పేర్కొంటూ బ్యానర్లతో నిరసన వ్యక్తం చేశారు. జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వకుండా యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమ్మక్క,సారలమ్మలను దర్శించుకుని ఉద్యోగాలు వచ్చేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# మహాత్మా గాంధీకి భట్టి నివాళులు

వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బాపుఘాట్ వద్ద గాంధీజీకి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి పుష్పాంజలి ఘటిస్తూ గాంధీజీ సేవలను స్మరించుకున్నారు. గాంధీజీ త్యాగాలు, ఆశయాలు దేశానికి శాశ్వత ప్రేరణగా నిలుస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అహింసను ఆయుధంగా, సత్యాన్ని మార్గంగా, శాంతిని సందేశంగా తీసుకుని దేశానికి దిశ చూపిన మహాత్మా గాంధీ బాట ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమని భట్టి విక్రమార్క అన్నారు. కష్టకాలాల్లో కూడా గాంధీజీ ఆలోచనలు ప్రజలను ఏకం చేశాయని, నేటికీ అవే విలువలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు.

# వనమెళ్లి.. ప్రణమిల్లి..

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి



- మేడారంలో కొనసాగుతున్న గిరిజన జాతర
- నిలువెత్తు 'బంగారం'తో పోటెత్తుతున్న భక్తజనం
- గేట్ల వద్దే తల్లులకు మొక్కుల సమర్పణ
- ఎక్కడ చూసినా జనమే.. జనం
- తల్లులను దర్శించుకుంటున్న ప్రముఖులు
- కిక్కిరిసిపోయిన జంపన్నవాగు
- ఏఐ నిఘాలో 'దక్షిణ భారత కుంభమేళా'
- వాహనాల రద్దీతో భారీగా ట్రాఫిక్ జామ్
- ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న మంత్రి సీతక్క
- నేడు తల్లుల వన ప్రవేశంతో జాతర ముగింపు

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ, తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దం మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. అడవి తల్లులైన సమ్మక్క, సారలమ్మలతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరడంతో తాడ్వాయి అరణ్యం భక్తజన సంద్రంగా మారింది. నేడు జాతరలో అత్యంత కీలకమైన మొక్కుల పండుగ కొనసాగుతోంది. కోట్లాది మంది భక్తులు తమ ఆరాధ్య దైవాలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకుంటూ ఆధ్యాత్మిక తన్మయత్వంలో మునిగిపోతున్నారు. లోపలికి వెళ్లేందుకు కష్టంగా ఉండడంతో మెయిన్ గేట్ వద్దే చాలా మంది భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

**మేడారం.. జనారణ్యం**

గురువారం రాత్రి చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి గద్దెపైకి కొలువుదీరడంతో జాతర సంపూర్ణమైంది. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు నలుగురు దేవతలు గద్దెలపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తులు తమ కోర్కెలు తీరినందుకు గుర్తుగా తమ నిలువెత్తు బరువుకు సమానమైన బెల్లాన్ని గద్దెల వద్ద సమర్పిస్తున్నారు. గద్దెల ప్రాంగణం మొత్తం బెల్లం వాసనతో, పసుపు, కుంకుమల వర్ణంతో నిండిపోయింది.
అమ్మల దర్శనం కోసం భక్తులు గంటల పాటు క్యూ లైన్లలో వేచి ఉంటున్నారు. గద్దెల ప్రాంగణంలో ఇసుకేస్తే రాలనంత జనం వస్తున్నారు. 'సమ్మక్కా.. సారలమ్మా..' అనే నామస్మరణతో అడవి మార్మోగిపోతుండటంతో అలసటను సైతం మరిచి భక్తులు ముందుకు సాగుతున్నారు.

**జంపన్నవాగు కిటకిట**

మేడారం వచ్చే ప్రతి భక్తుడు ముందుగా జంపన్నవాగులో స్నానం చేయడం ఆచారంగా వస్తోంది. సుమారు 5 కిలోమీటర్ల మేర జంపన్నవాగు భక్తులతో నిండిపోయింది. తడి బట్టలతోనే భక్తులు గద్దెల వైపు పయనిస్తున్నారు. తమ కష్టాలన్నీ ఆ జంపన్నవాగులో కొట్టుకుపోతాయని, అమ్మల దీవెనలు దక్కుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. జంపన్నవాగు వద్ద ఎక్కడా ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను, లైఫ్ జాకెట్లను ప్రభుత్వం సిద్ధంగా ఉంచింది.

**ప్రముఖుల సందడి..**

రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పలువురు వీఐపీలు అమ్మల దర్శనానికి తరలివస్తున్నారు. శుక్రవారం గవర్నర్, బ్రిటన్ అధికారి తల్లులను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించారు. మంత్రి సీతక్క స్వయంగా భక్తుల క్యూ లైన్లలో తిరుగుతూ, గిరిజన ఆచారాల ప్రకారం పూజల్లో పాల్గొంటున్నారు. అధికారులకు, భక్తులకు మధ్య వారధిలా ఉంటూ జాతరను పర్యవేక్షిస్తున్నారు.

**కిలోమీటర్ల మేర వాహనాలు**

మేడారం వచ్చే దారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ములుగు–మేడారం, నర్సంపేట–మేడారం రహదారుల్లో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. సుమారు 20 నుండి 30 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయినట్లు సమాచారం. భారీ వాహనాల కోసం కేటాయించిన పార్కింగ్ స్థలాలు నిండిపోవడంతో, రోడ్ల పక్కనే వాహనాలు నిలపడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయినప్పటికీ పోలీసులు నిరంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.

**నేడు వనప్రవేశ ఘట్టం**

మొక్కుల పండుగ వైభవంగా సాగుతుండగా, నేడు జాతరలో చివరి ఘట్టం జరగనుంది. సాయంత్రం సూర్యాస్తమయం వేళ వనదేవతలు తిరిగి వనప్రవేశం వెళ్తారు. ఈ క్రతువుతో జాతర అధికారికంగా ముగుస్తుంది. ఈ లోపే అమ్మలను దర్శించుకోవాలని భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. మేడారం జాతర కేవలం ఒక పండుగ మాత్రమే కాదు.. అది కోట్లాది మంది నమ్మకం. ప్రకృతిని దేవతగా కొలిచే ఈ అద్భుత ఉత్సవం నేడు తన సంపూర్ణ వైభవంతో వెలుగొందుతోంది.

**నిఘా నీడలో జాతర..**

లక్షలాది మంది జనం ఒకేసారి తరలిరావడంతో అపశ్రుతులు దొర్లకుండా పోలీస్ యంత్రాంగం అత్యంత ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తోంది. జాతరలో మొదటిసారిగా ఏఐ కెమెరాలను వాడుతున్నారు. వీటి ద్వారా జన సాంద్రత ఎక్కడ పెరుగుతుందో ముందే గుర్తించి, అదనపు బలగాలను అక్కడికి పంపుతున్నారు. మేడారం చుట్టుపక్కల 20 కిలోమీటర్ల పరిధిని డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. సుమారు 30 వేల మంది పోలీసులు, హోంగార్డులు, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది జాతర విధుల్లో ఉన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వ శిక్షణ పూర్తి

వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి

- 'లీడర్‌షిప్ ఇన్ ద 21వ శతాబ్దం' ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ ముగింపు
- శీతల వాతావరణంలో రోజంతా అకడమిక్ సెషన్లు
- 'తెలంగాణ రైజింగ్' దృక్పథానికి అంతర్జాతీయ గుర్తింపు

అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్లో నిర్వహించిన 'లీడర్‌షిప్ ఇన్ ద 21వ శతాబ్దం' ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసింది. ఈ ప్రతిష్ఠాత్మక శిక్షణా కార్యక్రమాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన మరో 62 మంది ప్రతినిధులు పూర్తి చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాఢమైన అకడమిక్ సెషన్లు నిర్వహించారు. నాయకత్వం, అధికార వినియోగం, పాలన, విధాన రూపకల్పన అంశాలపై నిర్మిత చర్చలు, గ్రూప్ వర్క్ ద్వారా లోతైన అవగాహన కల్పించారు. మైనస్ 15 డిగ్రీల నుంచి మైనస్ 24 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదైన తీవ్రమైన శీతల వాతావరణంలో కూడా తరగతులు నిరంతరాయంగా కొనసాగడం విశేషం. ప్రోగ్రామ్ పూర్తయ్యాక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ అధ్యాపకులు పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. చివరి రోజున రివిజన్ సెషన్లు, ముగింపు తరగతి చర్చలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పాలన, నాయకత్వంపై సమగ్ర అవగాహన కల్పించడమే ఈ కోర్సు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. హార్వర్డ్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుతున్న భారతీయ విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నాయకత్వ దృక్పథాలు, ప్రజాసేవ, వృత్తి ఆశయాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. ఈ పరస్పర చర్చలు తెలంగాణ రాష్ట్రం అవలంబిస్తున్న 'తెలంగాణ రైజింగ్' దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ, జ్ఞానాధారిత పాలన, అంతర్జాతీయ సహకారం, గ్లోబల్ ఎంగేజ్‌మెంట్‌కు రాష్ట్రం కట్టుబడి ఉందని స్పష్టంగా చాటాయి.

# తెలంగాణ జలాలను ఏపీకి దోచిపెడుతున్నారు

## బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరోపణ



వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి

తెలంగాణ జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు దోచిపెడుతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. పోలవరం–నల్లమలసాగర్ ప్రాజెక్టులకు రేవంత్ సర్కార్ సహకరిస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టులో రిట్ వాపస్ తీసుకోవడమూ ఈ కుట్రలో భాగమేనని అన్నారు. తెలంగాణ నీటి హక్కుల కోసం మరోసారి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రకటించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు స్పందించాలని డిమాండ్ చేశారు.

# వన దేవతల చెంత గవర్నర్

వేద న్యూస్, మేడారం



తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ప్రథమ మహిళ సుధా దేవ్ వర్మతో కలిసి మేడారం మహాజాతరను సందర్శించారు. సమ్మక్క–సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయ చీరలు సమర్పించారు. గిరిజన సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలను గౌరవిస్తూ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గవర్నర్ దంపతుల సందర్శనతో జాతరకు మరింత ప్రాధాన్యం లభించిందని అధికారులు తెలిపారు.

**తల్లులను దర్శించిన బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్**

భారతదేశంలోని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారత్ వెన్ ఓవెన్ మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయాన్ని సందర్శించారు. తులాభారం కార్యక్రమంలో పాల్గొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. సంప్రదాయ హ్యాండ్లూమ్ వస్త్రధారణలో హాజరై అందరి దృష్టిని ఆకర్షించారు. మేడారం జాతర ప్రాధాన్యత, ఆదివాసీ సంప్రదాయాలు, భక్తులకు కల్పించిన సౌకర్యాలను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్ వివరించారు. మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా గుర్తింపు పొందిందని అధికారులు తెలిపారు.

# సమ్మక్కసారలమ్మకు మొక్కులు చెల్లించిన కవిత

వేద న్యూస్, మేడారం



ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలకు, సామూహిక భక్తి చైతన్యానికి, సమష్టి ఆధ్యాత్మిక ప్రాభవానికి ప్రతీకగా నిలిచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. జాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎత్తు బంగారం మొక్కు చెల్లించుకొని అమ్మవార్లకు నివాళులు అర్పించారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆదివాసీ సంప్రదాయాలను గౌరవిస్తూ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతర ఆధ్యాత్మిక వాతావరణాన్ని కవిత ప్రశంసించారు. కోరిన కోరికలు తీర్చే వనదేవతలుగా సమ్మక్క–సారలమ్మలను భక్తులు విశ్వసిస్తారని, ఈ జాతరలో పాల్గొనడం ఆత్మీయ అనుభూతిని కలిగించిందని ఆమె పేర్కొన్నారు. సామూహిక భక్తి, సమష్టి విశ్వాసం మేళవించిన ఈ మహాజాతర గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమ్మక్క–సారలమ్మల దీవెనలతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆమె ప్రార్థించారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో శాంతి, శ్రేయస్సు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## ఉద్దేశపూర్వకంగా చేసినవి కావు

# క్షమించండి..

## ఫ్రస్టేషన్లో అలా మాట్లాడాను

- మనోభావాలు దెబ్బతిని ఉంటే మన్నించండి
- వివాదాస్పద వ్యాఖ్యలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వివరణ

వేద న్యూస్, హైదరాబాద్



తన వ్యాఖ్యలు ఉద్దేశ్యపూర్వకంగా చేసినవి కావని, ఎవరి మనోభావాలైనా దెబ్బతిన్నట్లయితే హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై, తన కుటుంబంపై రాజకీయ కక్షతో దాడులు జరుగుతున్నాయని, ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహమే కారణమని ఆరోపించారు. పోలీసులు, అధికారులు అంటే తనకు ఎంతో గౌరవమని పేర్కొంటూ, అయితే సమ్మక్క జాతరకు వెళ్తున్న సమయంలో కొందరు అధికారులు అడ్డుకొని తీవ్ర ఒత్తిడికి గురి చేశారని తెలిపారు. ఆ సమయంలో ఏర్పడిన ఫ్రస్టేషన్, మానసిక ఒత్తిడిలో తన నోరు జారిందని, అంతే తప్ప ఎవరి పట్లనూ కావాలనే దూషణలు చేయలేదని కౌశిక్ రెడ్డి వివరణ ఇచ్చారు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకుని కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై మరింత వివాదాలు అవసరం లేదని, దీనిని ఇంతటితో ముగించాలని అందరినీ వేడుకుంటున్నట్లు పాడి కౌశిక్ రెడ్డి కోరారు.

వేద న్యూస్

శనివారం జనవరి 31, 2026

# తనిఖీల్లో రూ.20 లక్షల నగదు స్వాధీనం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీగా నగదు స్వాధీనం అయ్యింది. శుక్రవారం ఉదయం సుమారు 07:45 గంటల సమయంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మండలం రగుడు వద్ద ఏర్పాటు చేసిన ఎస్‌-ఎస్‌టీ బృందం చెక్‌పోస్ట్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ౹+ 23 ౚా 1524 నంబర్ గల కారును పోలీసులు ఆపి తనిఖీ చేయగా, కార్ డ్రైవర్ గణాచారి సాంబాశివ్ వద్ద నుంచి రూ.20లక్షల నగదును గుర్తించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం.. ఆ నగదు మొత్తాన్ని ఎస్ఎస్‌టీ బృంద ఇన్‌చార్జ్ జి. ఆనంద్, ఏపీఆర్ఓ సమక్షంలో, మధ్యవర్తుల పంచనామా సాక్షుల సమక్షంలో చట్టపరంగా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన నగదు మూలం, వినియోగ ఉద్దేశ్యంపై తెలుసుకునేందుకు తదుపరి విచారణ కొనసాగుతున్నట్లు సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె. కృష్ణ తెలిపారు.

# ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీజీ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, బచ్చు రాము, బేజుగం వెంకటేశం, మహాజన్ విశ్వనాథ్, మహాజన్ చంద్రశేఖర్, చిదుర మహిపాల్, అశోక్, హరీరామ్, వినయ్, బోయి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ టీ పౌడర్‌పై అవగాహన

**వేద న్యూస్, శాయంపేట:**



నకిలీ టీ పౌడర్‌ను ఎలా గుర్తించాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం గూడెప్పాడ్ సెంటర్ సమీపంలోని ఎంఎం మార్ట్‌లో వరంగల్ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దాదాపు 40 కిలోల నకిలీ టీ పౌడర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ అధికారులు కృష్ణమూర్తి, మౌనిక నకిలీ టీ పౌడర్‌ను అసలైనదానితో ఎలా గుర్తించాలో ప్రత్యక్ష డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, శాయంపేట ఎస్ఐ పరమేశ్వర్, దామెర ఎస్ఐ కొంక అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ పరిశీలన

**- ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్ తనిఖీ**

**వేద న్యూస్, వేములవాడ:**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్‌ను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్‌లో నిర్వహిస్తున్న వాహన తనిఖీలు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించి, ఎన్నికల నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాబాయి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, నోడల్ అధికారులు నవీన్ కుమార్, శ్రీనివాసాచారి, తహసీల్దార్లు జయంత్ కుమార్, మహేష్ కుమార్, టీపీఓ అన్సార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక పండుగలు

**- సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే**

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండలం మధురానగర్, బూరుగుపల్లి గ్రామాల్లో నిర్వహించిన సమ్మక్క-సారలమ్మ జాతరలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతర కమిటీ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మండల ప్రజలు జాతరను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు. అలాగే మధురానగర్, బూరుగుపల్లి గ్రామాల్లో సమ్మక్కసారలమ్మ జాతర అభివృద్ధికి అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేముల భాస్కర్, ఉపసర్పంచ్ తూం రాజు, అంజి, సాగి అజయ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ సిద్ధాంతాలు ఆదర్శం

**- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**

**- గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**

**వేద న్యూస్, శాయంపేట:**



జాతిపిత మహాత్మా గాంధీ సిద్ధాంతాలు, ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద గల గాంధీ విగ్రహానికి బుచ్చిరెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహింసా మార్గాన్ని ఆయుధంగా చేసుకుని కోట్లాది దేశ ప్రజలను ఒక్కతాటిపై నడిపి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు గాంధీజీ అని గుర్తు చేశారు. గాంధీజీ బోధించిన సత్యం, అహింస, శాంతి, సేవ వంటి సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం ఆచరించాలని పిలుపునిచ్చారు. అలాగే స్వదేశీ భావన, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను సాకారం చేసేందుకు అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, దుబాసి కృష్ణ మూర్తి, నిమ్మల రమేష్, మస్కే కుమారస్వామి, మారపెల్లి వరద రాజు, డీటీ రెడ్డి, మార్కండేయ, రఫీ, దామెరకొండ కొమురయ్య, సుదర్శన్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ టోర్నమెంట్ పోటీలను గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, తహశీల్దార్ తారాబాయి, ఎంపీడీఓ బాల గంగాధర్ స్థానిక మండల నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడా పోటీల జెండాను ఆవిష్కరించారు. ఈ సీఎం కప్ టోర్నమెంట్‌లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో కేజీబీవీ పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాలలకు చెందిన విద్యార్థులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, మాజీ జడ్పీటీసీ నారోజి గంగారాం, జహీరాబాద్ పార్లమెంట్ దిశ కమిటీ సభ్యుడు నడిపింటి నగేష్, నాయకులు పత్తి రాము, తోట సంగయ్య, పత్తి లక్ష్మణ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, వివిధ పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# జాతిపిత ఆశయాలను సాధించాలి

**- మహాత్ముడి అడుగుజాడల్లో నడవటమే నిజమైన నివాళి**

**- బడుగుల లింగయ్య యాదవ్, నల్లమోతు సిద్ధార్థ**

**వేద న్యూస్, దామరచర్ల:**



జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను సాధించేందుకు యువత ముందుండి కృషి చేయాలని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్ధార్థ పిలుపునిచ్చారు. మహాత్ముడి అడుగుజాడల్లో నడవటమే ఆయనకు నిజమైన నివాళి అని వారు అభిప్రాయపడ్డారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆంగ్లేయుల బానిసత్వం, నిరంకుశ పాలన నుంచి అఖండ భారతావనిని విముక్తి చేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు గాంధీజీ అని పేర్కొన్నారు. సత్యం, అహింస, ధర్మం, శాంతియుత మార్గాలను ఆయుధాలుగా చేసుకుని బాపూజీ తన కలలను సాకారం చేసుకున్నారని అన్నారు. అంటరానితనం, కుల మత వివక్షలేని సమాజ స్థాపన కోసం ఆయన జీవితాంతం పోరాడారని గుర్తు చేశారు. సత్యాగ్రహం, సహాయనిరాకరణ వంటి ఉద్యమాలతో "రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని" గడగడలాడించారని చెప్పారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని గాంధీజీ నమ్మేవారని పేర్కొన్నారు. మహాత్ముడి ఆశయాలకు అనుగుణంగా కేసీఆర్ సుపరిపాలన అందించారని వారు అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేసిందని తెలిపారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాలు, పట్టణాల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసిందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, ప్రభుత్వ పనితీరుకు ప్రతిఫలంగా ప్రతి ఏడాది స్వచ్ఛ భారత్ అవార్డులు రాష్ట్రానికి వరించాయని గుర్తు చేశారు. మహాత్ముడి జీవితంలో ఎదురైన ఒడిదుడుకులను అవగాహన చేసుకోవాలంటే ఆయన ఆత్మకథ సత్యాన్వేషణలో నా ప్రయోగాలు ను యువత తప్పనిసరిగా చదవాలని వారు కోరారు.

# లోపాయికారీ ఒప్పందం.. శ్రేణుల్లో అయోమయం!




**- మున్సిపల్ ఎన్నికల్లో సరికొత్త చర్చ**

**- స్వతంత్రులుగా పోటీ చేసే యోచనలో అభ్యర్థులు?**

**- ఏపార్టీలోకి మారినా ఓటమి భయం**

**వేద న్యూస్, కరీంనగర్:**

రానున్న కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో కార్పొరేటర్లుగా గెలిచి తమ సత్తా చాటుకోవాలని భావిస్తున్న కొంతమంది అభ్యర్థుల్లో ప్రస్తుతం అయోమయం నెలకొన్నట్టు కనిపిస్తోంది. టికెట్ ఆశించిన పార్టీలు ఆశించిన విధంగా అక్కున చేర్చుకోకపోతే, మరో పార్టీవైపు అడుగులు వేయాలా..? లేక స్వతంత్రులుగా బరిలోకి దిగాలా..? అన్న అంశంపై అభ్యర్థులు మీనమేషాలు లెక్కిస్తున్నట్టు సమాచారం. ప్రధాన పార్టీల కీలక నేతల మధ్య అంతర్గత సమన్వయం ఉందన్న ప్రచారం విస్తృతంగా సాగుతుండటంతో, కొన్ని డివిజన్లలో పట్టున్న స్థానిక నాయకులు ఏ పార్టీవైపు వెళ్లినా తాము నష్టపోతామేమోనన్న సందేహంలో ఉన్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికల్లో వివక్షకు గురై పార్టీలు మారిన కార్పొరేటర్ల పరిస్థితిని ఉదాహరణగా చర్చించుకుంటున్నారని సమాచారం. ఈ పరిస్థితుల నేపథ్యంలో, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనపై కొంతమంది నాయకులు సమాలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఏదో ఒక పార్టీ తరఫున గెలిచినా, పార్టీల మధ్య ఉన్న అంతర్గత సమన్వయం వల్ల తమ మాటకు విలువ ఉండదని, చివరికి బల్దియాలో నామమాత్రంగా మిగిలిపోతామన్న ఆందోళన కూడా వారిని వెంటాడుతోంది. అందుకే స్వతంత్రులుగా పోటీ చేసి గెలిస్తే భవిష్యత్తులో తమకు ప్రాధాన్యత పెరుగుతుందని, మెజారిటీ సాధించలేని పార్టీల ముందు తమ డివిజన్ అభివృద్ధి అంశాలపై గట్టిగా డిమాండ్ చేసే అవకాశం ఉంటుందన్న అంచనాతో కొంతమంది ముందుకు సాగుతున్నారని సమాచారం.

**వారే కీలకం..**

మేయర్ ఎన్నికల సందర్భంలో కూడా స్వతంత్రులుగా గెలిచిన కార్పొరేటర్లే కీలక పాత్ర పోషించే అవకాశం ఉందన్న లెక్కలు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. అలాగే, తమకు అన్యాయం జరిగింది.. అనే ప్రచారం ద్వారా డివిజన్లలో సానుభూతి ఓటు పొందే అవకాశాలు కూడా మెరుగవుతాయని కొందరు భావిస్తున్నట్టు తెలుస్తోంది. అన్ని పార్టీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇది ప్రధాన పార్టీలకు సరికొత్త సవాలుగా మారనుంది. కార్పొరేటర్ అభ్యర్థుల మధ్య సాగుతున్న ఈ చర్చ, రానున్న ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

- ఇంచార్జ్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్
- సంకేపల్లి, శాత్రాజపల్లి, కోనాయపల్లి ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టుల తనిఖీ

**వేద న్యూస్, వేములవాడ:**




మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఇంచార్జ్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కరీంనగర్ రోడ్డులో సంకేపల్లి, జగిత్యాల రోడ్డులో శాత్రాజపల్లి, కోరుట్ల రోడ్డులో కోనాయపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టులను ఇంచార్జ్జి కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో నగదు, మద్యం తదితర నిషేధిత వస్తువుల తరలింపును అడ్డుకునేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి, ఇప్పటివరకు తనిఖీ చేసిన వాహనాల వివరాలు, స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలపై ఆరా తీశారు. వాహనాల తనిఖీ ప్రక్రియను కటు ్టదిట్టంగా నిర్వహించాలనీ, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి తనిఖీ వివరాన్ని రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని, అవసరమైన చోట వీడియో రికార్డింగ్ చేయాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని ఇంచార్జ్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో తహసీల్దార్ జయంత్ కుమార్, రెవెన్యూ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్రావుపల్లెలో పౌర హక్కుల దినోత్సవం

- అంటరానితనం, కుల వివక్ష, అత్యాచారాలపై అవగాహన

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్ చల్ల నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అంటరానితనం, కుల వివక్షత, అత్యాచారాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ రాజ్, రెవెన్యూ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కులం పేరుతో వివక్ష చూపడం, అత్యాచారాలకు పాల్పడడం, అంటరానితనం పాటించడం చట్టరీత్యా నేరం అని స్పష్టం చేశారు. ప్రతి నెల చివరి తేదీన ఒక గ్రామాన్ని ఎంపిక చేసి పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా గ్రామాల్లో కులాలకు అతీతంగా ఐక్యత, సమన్వయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలపై కుల వివక్షత లేదా అంటరానితనం చూపినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏంపీఓ శ్రీనివాస్, ఆర్ఐ సంతోష్, పోలీస్ అధికారి రమణ రెడ్డి, జీపీఓ స్వప్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంద రాజు, కార్యదర్శి ప్రియాంక, ఉప సర్పంచ్ అనగోని అవినాష్, వార్డు సభ్యులు మంద రేణుక, మంద అనిల్, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

# వేములవాడలో ప్రశాంతంగా కొనసాగుతున్న బార్ కౌన్సిల్ ఎన్నికలు

- ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది పొత్తూరు అనిల్ కుమార్

**వేద న్యూస్, వేములవాడ:**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బార్ కౌన్సిల్ ఎన్నికల్లో భాగంగా వేములవాడ కోర్టు పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఎన్నికలకు సంబంధించిన ఓటింగ్ బాక్స్‌కు జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి సీల్ వేశారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఈ ఎన్నికలకు సీనియర్ న్యాయవాది పొత్తూరు అనిల్ కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35,316 మంది ఓటు హక్కు కలిగిన న్యాయవాదులు ఉండగా, బార్ కౌన్సిల్ అభ్యర్థులుగా 148 మంది పురుషులు, 55 మంది మహిళలు బరిలో ఉన్నారు. వేములవాడ కోర్టులో మొత్తం 121 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఎంతమంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారన్న వివరాలు సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఎన్నికలకు ఎన్నికల అబ్జర్వర్‌గా సీనియర్ సివిల్ కోర్టు సూపరింటెంట్ అంజయ్య, సహాయ ఎన్నికల అధికారిగా న్యాయవాది నక్క దివాకర్ వ్యవహరిస్తున్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

- ఎంపీడీవో రాధ

**వేద న్యూస్, చందుర్తి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల మైదానంలో శుక్రవారం సీఎం కప్ పోటీలను ఎంపీడీవో ఎల్ రాధ, సీఐ వెంకటేశ్వర్లు, సర్పంచ్ పులి సత్యం కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయని, ఆటల ద్వారా మానసిక ఉల్లాసం పెరుగుతుందని తెలిపారు. క్రీడలు యువతను మంచి దారిలో నడిపించే సాధనంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ఆటలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ, గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. సీఎం కప్‌లో భాగంగా ఖోఖో, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బత్తుల క్రాంతి, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, ఎస్ఐ జిల్లెల్ల రమేష్, ఉపాధ్యాయులు, పలువురు నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు

# చెరువులో దూకి యువకుని ఆత్మహత్య

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామానికి చెందిన దర్జి శ్రీకాంత్ (21) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది గ్రామ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాంత్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతని తల్లి నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో, అప్పటి నుంచి శ్రీకాంత్ ఒంటరిగా ఉంటూ తీవ్ర మానసిక వేదనకు లోనవుతున్నాడని తెలిపారు. ఈ నెల 27న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీకాంత్ తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. శుక్రవారం గ్రామ చెరువులో శ్రీకాంత్ మృతదేహం లభ్యమైన నేపథ్యంలో, మృతుడి అన్న నాగనాథ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి వేడుకలు

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కొత్తపల్లి రవికిరణ్ మాట్లాడుతూ.. గాంధీ ఎంచుకున్న మార్గమే దేశానికి దిక్సూచి అని అన్నారు. సత్యాగ్రహాన్ని ఆయుధంగా చేసుకుని అహింసా మార్గంలో పోరాడి కోట్లాది భారతీయులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అందించిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ గాండ్ల మధు, దౌడ్ సాయిలు, కరోల్ల వెంకట్, పార్వతి ప్రవీణ్, శంకరి వీరయ్య, నేరేడు సాయిలు, శ్రీకాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎం. రాజు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సాధనలో అహింస, సత్యం అనే మార్గాలను ప్రపంచానికి చాటిచెప్పిన మహానుభావుడు గాంధీజీ అని పేర్కొన్నారు. గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి, సమాజ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రేగుల కార్తీక్, చేరాల వంశీకృష్ణ, అంతటి శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు మామిడి నరేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రోజు సంతోష్ కుమార్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు జమాల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు అప్పయ్య సేటు, నార్ల రాంకిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూనబోయిన బాలరాజు, రవీందర్ రెడ్డి, పర్శరాం, కూనబోయిన సుధాకర్, హైదర్ చంద్రయ్య, నర్సయ్య, అంజయ్య, యువజన సంఘాల సభ్యులు ఎర్రోజు రవితేజ, తాటిపెల్లి శ్రీనివాస్, ఎలుక పవన్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో పాస్‌పోర్ట్ సేవలు

**వేద న్యూస్, మహబూబాబాద్:**



పాస్‌పోర్ట్ కోసం మహబూబాబాద్ జిల్లాలోని యువత, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టి లో ఉంచుకుని, జిల్లా ప్రజలకు సౌకర్యవంతమైన, వేగవంతమైన పాస్‌పోర్ట్ సేవలు అందించేందుకు మహబూబాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో పాస్‌పోర్ట్ సేవలు అందు బాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ద్వారా కొత్త పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియ, పాస్‌పోర్ట్ పునరుద్ధరణకు సంబంధించిన పత్రాల ధృవీకరణ తదితర సేవలను త్వరితగతిన అందిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్-2025 నాటికి సుమారు 38 వేల మందికి సంబంధించిన పాస్‌పోర్ట్ జారీ పత్రాల ధృవీకరణ ఈ కేంద్రం లో పూర్తయ్యిందని వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా ప్రజలతో పాటు సమీప జిల్లాల ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పాస్‌పోర్ట్ సేవలను సులభంగా పొందాలని వరంగల్ పోస్టల్ సూపరింటెండెంట్ బి. రవి కుమార్ కోరారు.

# ఉచిత వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ

**వేద న్యూస్, మందమర్రి:**



సింగరేణి పరిధిలోని మారుమూల ప్రభావిత గ్రామాల కార్మిక కుటుంబాల పిల్లలకు ఉచిత వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ అందించనున్నట్లు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణకు 10వ తరగతి ఉత్తీర్ణత, భారీ మోటార్ వాహన డ్రైవింగ్ లైసెన్స్, అలాగే కనీసం 3 సంవత్సరాల డ్రైవింగ్ అనుభవం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. మొదటి విడత శిక్షణను ఫిబ్రవరి 02 నుంచి 21 వరకు మొత్తం 18 రోజుల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 60 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నామని, ప్రతి ఏరియా నుంచి అర్హత కలిగిన 5 మంది చొప్పున అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం మందమర్రి ఏరియా ఎంవీటీసీ కార్యాలయంలోని మేనేజర్‌ను సంప్రదించాలని సూచించారు

# శాంతి నగర్లో ఘనంగా సమ్మక్క-సారలమ్మ జాతర

**వేద న్యూస్, వీర్నపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం శాంతి నగర్ గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవాలు సమ్మక్క, సారలమ్మ జాతరను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా సమ్మక్క-సారలమ్మలకు ప్రత్యేక పూజలు, నెయ్యి దీపాల సమర్పణ, బెల్లం సమర్పణలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. గ్రామమంతా భక్తి వాతావరణం నెలకొని పండుగ కళ ఉట్టిపడింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. జాతర గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి జాతరలు గ్రామాల్లో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జాతరను సజావుగా నిర్వహించేందుకు గ్రామ యువకులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతియుతంగా జాతర ముగిసింది.

## ఘనంగా తుంబురీశ్వర స్వామికి బండ్లు బోనాలు



**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం పరదిలోని వేల్పుగొండ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మితమైన తుంబురీశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా 30వ తేదీ శుక్రవారం, మాఘ శుద్ధ ద్వాదశి సందర్భంగా ఉదయం దేవతామూర్తులకు రుద్రాభిషేకం, వృహవచనం, కలశ స్థాపన, శకట ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం బండ్ల ఊరేగింపు ఘనంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీ రవికోటి వైద్య రామశర్మ మాట్లాడుతూ, ఉత్సవాల సందర్భంగా నిత్య అన్నదానం, భజన, సంకీర్తనలు నిర్వహించడంతో ఆలయం భక్తులకు కనువిందు చేస్తోందని తెలిపారు. ఈ ఉత్సవాలలో గ్రామ సర్పంచ్ నిరుడి దాస్, ఉపసర్పంచ్ ఎంపీ సుధాకర్, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## మహాత్మా గాంధీ ఆశయాలను కొనసాగిద్దాం

- సర్పంచ్ కోట్ల ఆంజనేయులు



**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామ సర్పంచ్ కోట్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీజీ వర్ధంతి ని పురస్కరించుకొని గ్రామ పంచా యతీ కార్యాలయం ఎదుట మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, గాంధీజీ బోధించిన సత్యం, అహింస, సేవా భావం నేటి సమాజానికి మరింత అవసరమని అన్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లతో కలిసి కుష్టి వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బి. యోనా, పంచాయతీ కార్యదర్శి మహేష్, నాయకులు చిన్న రాయుడు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నే గెలిపించాలి

- ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**వేద న్యూస్, దేవరకద్ర:**

దేవరకద్ర మున్సిపాలిటీలో నీతికి, నిజాయితీ కి, ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్ పిలుపు నిచ్చారు. దేవరకద్ర మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్ కార్య కమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నామినేషన్ ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు పెద్ద సంఖ్యలో దేవరకద్ర మున్సిపాలిటీ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, అభివృద్ధికి అండగా నిలవాలని కోరారు. దేవరకద్ర మున్సిపాలిటీ ప్రజల ఆశీస్సులతో మొత్తం 12కి 12 స్థానాలు గెలుచుకుని మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. తదనంతరం దేవరకద్ర మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.

## భూత్పూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

- ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి



**వేద న్యూస్, భూత్పూర్:**

భూత్పూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి జెండాను ఎగురవేయాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న మున్సిపల్ ఎన్ని కల్లో 10కి 10 స్థానాలు గెలుచుకుని భూత్పూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ పట్టు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భూత్పూర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములు కావాలని కోరారు.

## స్వామివారి కరుణా కటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

- వెంకటేశ్వర కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



**వేద న్యూస్, వనపర్తి:**

వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలం గట్టుకాడిపల్లి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, శారదా రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక కైంకర్యాలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే దంపతులకు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. దాదాపు మూడు గంటల పాటు కొనసాగిన ఈ మహోత్సవంలో తలంబ్రాలు, జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ కార్యక్రమాలను వేద పండితులు ఎమ్మెల్యే దంపతులతో ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీ వేంకటేశ్వర స్వామివారి కరుణ కటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం వేద పండితులు దంపతులకు వేద ఆశీర్వాదాలు అందించారు. తర్వాత భక్తులతో కలిసి స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, మహిళలు, యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యమాలకు సిద్ధమవుతున్నాం



**వేద న్యూస్, బోయినిపల్లి:**

- 35ఉపాధ్యాయ సంఘాలు ఏకం అవుతున్నాయి
- పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం 35 ఉపాధ్యాయ సంఘాలను ఐక్యం చేసి ఉద్యమాలకు సిద్ధమవుతున్నామని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వర్దవెల్లి ఉన్నత పాఠశాలలో ఆలూరి ఆనందరావు పదవీ విరమణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిక్షం గౌడ్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు రెండున్నర సంవత్సరాలుగా చెల్లించకపోవడం దురదృష్టకరమని అన్నారు. అలాగే 2023 జూలై నుంచి అమలుకావలసిన పీఆర్సీని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, దీని వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర నిరాశలో ఉన్నాయని పేర్కొన్నారు. పిఆర్టీయూటీఎస్ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5, 2026న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం సయ్యద్ మహమ్మద్, గ్రామ సర్పంచ్ చల్లా శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ మందాల వరుణ్, పిఆర్టీయూటీఎస్ జిల్లా, మండల నాయకులు మరియు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మమత-అజయ్ దంపతుల నామినేషన్

**వేద న్యూస్, వేములవాడ:**



వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలోని 22వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులుగా ఇప్పపూల మమత-అజయ్ దంపతులు శుక్రవారం తమ నామినేషన్ దాఖలు చేశారు. ప్రజాసేవనే ప్రధాన లక్ష్యంగా గతంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో మరోసారి ప్రజల ముందుకు వచ్చామని వారు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ జీవితాంతం ప్రజల సేవకే అంకితం చేస్తామని పేర్కొన్నారు. మాజీ ప్రజాప్రతినిధి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తమ తండ్రి ఇప్పపూల లక్ష్మిరాజం ఆశయాలను, అలాగే అన్న ఇప్పపూల వినోద్ కుమార్ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాజీవితాన్ని కొనసాగిస్తామని అన్నారు. 22వ వార్డులోని సమస్యలను దగ్గరుండి గమనించి పరిష్కారానికి కృషి చేసిన నాయకులుగా మమత-అజయ్ దంపతులు ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారని స్థానికులు తెలిపారు. పదవులకన్నా ప్రజలే ముఖ్యమని నిరూపిస్తూ వార్డు అభివృద్ధికి నిరంతరం శ్రమించారని పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమానికి వార్డుకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి భారీ మెజారిటీతో గెలిపిస్తామని ప్రజలు ఆశీర్వదించారు. ప్రజల మధ్య నుంచే వచ్చిన నాయకులుగా ఈ దంపతులకు ఈ ఎన్నికల్లో విశేషమైన మద్దతు లభించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# యువత దేశ సేవకు సిద్ధంగా ఉండాలి



**వేద న్యూస్, చందుర్తి:**

- సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం భారత సైన్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఆర్మీ అధికారులు నిర్వహించి, విద్యార్థులకు సైన్యంలో చేరేందుకు అవసరమైన శిక్షణ, అర్హతలు, అవకాశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆర్మీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, వయోపరిమితి, ఎగ్జామినేషన్ విధానం, తయారీ ప్రణాళిక తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని, అందుకే యువత దేశ సేవకు సిద్ధంగా ఉండాలని, దేశ రక్షణలో భాగంగా ముందుకు రావాలని ఆర్మీ అధికారులు పిలుపునిచ్చారు. ప్రొజెక్టర్ ద్వారా ప్రత్యక్షంగా విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అధ్యాపక బృందంతో కలిసి ఆర్మీ అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతృప్తి వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పార్టీలో జోరుగా చేరికలు

- కండువాలు కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీకి చెందిన తండాల వాసులు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఉమ్మడి మానాల పరిధిలోని రుద్రంగి మండలం బడి తండాకు చెందిన గుగులోత్ రాజు నాయక్, మోహన్, తిరుపతి, అంగోత్ తిరుపతి, నరేందర్, సుమన్, బానోత్ వినోద్, రాజు, మనోజ్, రూప్లా నాయక్ తండాకు చెందిన లోలావత్ దేవా నాయక్, జ్యోద్యా తండాకు చెందిన గుగులోత్ శ్రీనివాస్, సర్పంచ్ తండాకు చెందిన బీఆర్ఎస్ మాజీ ఉప సర్పంచ్ గుగులోత్ గణపతి, దేగావత్ తండా వార్డు సభ్యుడు కున్సోత్ లక్పతి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ వారందరికీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తండాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా లక్ష్మణ్ నాయక్, బానోత్ గంగాధర్, బానోత్ రామదాస్, గుగులోత్ రఘుపతి నాయక్, గుగులోత్ మదన్, భూక్యా తిరుపతి, బానోత్ రమేష్, గుగులోత్ రాజు, భూక్యా జవహర్లాల్, గుగులోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలకు కాంగ్రెస్ చేసింది ఏమీ లేదు

- మాజీ ఎమ్మెల్యే అల్ వెంకటేశ్వర రెడ్డి

**వేద న్యూస్, భూత్పూర్:**



గత రెండేళ్ల కాలంలో మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీ లేదని మాజీ ఎమ్మెల్యే అల్ వెంకటేశ్వర రెడ్డి విమర్శించారు. భూత్పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాడే పార్టీగా బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

# బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

- మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి
- బడుగుల లింగయ్య యాదవ్
- వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల ప్రారంభం



**వేద న్యూస్, దామరచర్ల:**

వచ్చే నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులంతా సమాయత్తం కావాలని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ పిలుపునిచ్చారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని 25, 39వ వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కౌన్సిలర్ అభ్యర్థులు వార్డు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, ప్రచార కార్యక్రమాలు క్రమబద్ధంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుపై పోటీ చేస్తున్న అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యాలయాల ప్రారంభోత్సవం అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ ర్యాలీల్లో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిట్టిబాబు నాయక్, నాగార్జున చారి, నారాయణరెడ్డి, వీరకోటిరెడ్డి, బాలాజీ నాయక్, జెర్రిపోతుల రాములు గౌడ్, కుర్ర శ్రీను నాయక్, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన బార్ కౌన్సిల్ ఎన్నికలు

- పోలీస్ భద్రత మధ్య పోలింగ్



**వేద న్యూస్, వనపర్తి:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ కార్యాలయాల్లో పోలీస్ భద్రత మధ్య పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 203 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, 33 జిల్లాలకు చెందిన సుమారు 35,274 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కౌంటింగ్ ఫిబ్రవరి 10న ప్రారంభ మవుతుందని బార్ కౌన్సిల్ ఒక ప్రకటనలో తెలిపింది. వనపర్తి జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్‌లో జరిగిన పోలింగ్‌ను ఎన్నికల అధికారి డి. కిరణ్ కుమార్, సీనియర్ సివిల్ జడ్జి కార్తీక్, సూపర్వైజర్ రహీమత్ పర్యవేక్షించారు. వనపర్తిలో మొత్తం 161 ఓట్లు నమోదయ్యాయని ఎన్నికల అధికారి వెల్లడించారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ సభ్యుడిగా పోటీ చేస్తున్న మున్నూరు రవీందర్ మాట్లాడుతూ, న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఫలితాలు అనుకూలంగా వస్తాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో వనపర్తి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు శ్రీనివాసాచారి, బాధగౌని విజయ్ గౌడ్, ప్రకాష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఎస్ఐ బైరు గోపి

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడిని ఆస్పత్రికి తరలింపు



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని వెంటనే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఎస్సై బైరు గోపి మానవత్వాన్ని చాటుకున్నారు. కారేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తున్న యువకుడు ఎదురుగా వస్తున్న లారీని గమనించకుండా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో రోడ్డుపై పడిపోయి అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని గమనించిన ఎస్ఐ బైరు గోపి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, పోలీసు వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన యువకుడు వారణాసి ప్రవీణ్ కుమార్ కాగా, అతను కామేపల్లి మండల పరిధిలోని జోగ్గూడెం గ్రామంలో పోస్టల్ శాఖలో పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధుల్లో భాగంగా ఉత్తరాల బట్వాడా కోసం ద్విచక్ర వాహనంపై వస్తుండగా, క్రాస్‌రోడ్డు వద్ద మలుపు తిరుగుతుండగా ఖమ్మం నుంచి కారేపల్లి వైపు వెళు _న్న లారీని ఢీకొన్నాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారణాసి ప్రవీణ్ కుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలానికి చెందినవాడిగా గుర్తించారు. అతను నాలుగు నెలల క్రితమే పోస్టల్ శాఖలో ఉద్యోగం పొందినట్లు తెలిపారు. సమయానికి స్పందించి యువకుడి ప్రాణాలను కాపాడిన ఎస్ఐ బైరు గోపిని స్థానిక ప్రజలు అభినందించారు.

# మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ దూకుడు

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ ఆధ్వర్యంలో ప్రచారం



**వేద న్యూస్, దామరచర్ల:**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మిర్యాలగూడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులు వేగంగా ముందుకు దూసుకెళ్తున్నాయి. అధికార కాంగ్రెస్ పాలనపై పట్టణ ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తోందని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారని సమాచారం. గతంలో నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని నేతలు అంటున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ప్రచారంలో పాల్గొన్న ప్రతిచోట ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, అభివృద్ధి కాలాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. యువ నేత నల్లమోతు సిద్ధార్థ పర్యటనలకు కూడా మంచి ఆదరణ కనిపిస్తోందని తెలిపారు. ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేసిన బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, యువ నేత నల్లమోతు సిద్ధార్థ మద్దతుతో ప్రచారాన్ని ఉధృతంగా కొనసాగిస్తున్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని వార్డు ప్రజలను కోరుతున్నారు.

# సీఎం కప్ కబడ్డీలో భాగ్యనగర్ తండా ఘన విజయం

**వేద న్యూస్, కారేపల్లి:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం జరిగిన కబడ్డీ మ్యాచ్‌లో భాగ్యనగర్ తండా జట్టు కారేపల్లి జట్టుపై ఘన విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభం నుంచే భాగ్యనగర్ తండా క్రీడాకారులు ఆధిపత్యం ప్రదర్శించారు. రైడింగ్, టాకిల్స్‌లో అదరగొట్టి కారేపల్లి జట్టును కేవలం 8 పాయింట్లకే పరిమితం చేసి, 26–08 పాయింట్ల తేడాతో ఏకపక్షంగా గెలుపొందారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు సీఎం కప్ మంచి వేదికగా మారిందని క్రీడాభిమానులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఘనవిజయం సాధించిన భాగ్యనగర్ తండా జట్టు సభ్యులను, కోచ్‌ను పలువురు అభినందించారు. తదుపరి స్థాయి పోటీల్లో కూడా ఇదే ఊపుతో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# పోతుగంటిపల్లిలో వృద్ధుడి ఆత్మహత్య



**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం పోతుగంటిపల్లి గ్రామానికి చెందిన కదారి మల్లారెడ్డి (85) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డి తన చిన్న కుమారుడి ఇంటి ఆవరణలోని ఒక గదిలో నివసిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆయన భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో, అప్పటి నుంచి ఒంటరితనంతో మానసిక వేదనకు లోనవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

# సీఎం కప్-2026’ క్రీడలు ప్రారంభం



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీ హెచ్ఎస్) క్రీడా ప్రాంగణం నేడు క్రీడా ఉత్సాహంతో ఉరకలేసింది. మండల స్థాయి సీఎం కప్–2026 క్రీడా పోటీలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ పి. శ్రీనివాస్, తహసీల్దార్ ఎమ్మార్వో అనంతుల రమేష్, మండల విద్యాధికారి ఎంఈఓ దుగ్గిరాల జయరాజ్, స్థానిక ఎస్ఐ బైరు గోపి సంయుక్తంగా జెండా ఆవిష్కరణ చేసి, రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం ఈ వేదికను కల్పించిందని, క్రమశిక్షణతో ఆడి మండల కీర్తిని రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో మండలంలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీలు), ఉపాధ్యాయ బృందం, పెద్ద సంఖ్యలో హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల మార్చ్ పాస్ట్, క్రీడాకారుల నినాదాలతో మైదానం కోలాహలంగా మారింది. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటేందుకు ఉత్సాహంగా సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, క్రీడాభిమానులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

# అగ్ని ప్రమాదంతో ఇల్లు పూర్తిగా దగ్ధం

- బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణంలోని 12వ వార్డు పరిధిలో అగ్ని ప్రమాదం సంభవించి ఒక ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం స్థానిక నాయకుడు, మాజీ పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్ ద్వారా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు చేరింది. సమాచారం అందుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించి, భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చిల్ల శ్రవణ్, చల్ల అనుష్, సంబోజి సాయి, తాడూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి పోస్టర్లను ఆవిష్కరించిన ఇంచార్జి కలెక్టర్

- ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ ఈఓ, అర్చకులు



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ఈ నెల 14వ తేదీ నుంచి వేములవాడలో నిర్వహించనున్న మహా శివరాత్రి జాతరకు సంబంధించిన పోస్టర్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆలయ ఈఓ రమాదేవి, అధికారులు, అర్చకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈఓ, అర్చకులు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు మహా శివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వేములవాడలో మహా శివరాత్రి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు, అందులో 15వ తేదీన మహా శివరాత్రి ప్రధాన ఉత్సవం జరుగుతుందని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకుని, ప్రణాళికాబద్ధంగా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సీఎం కప్ టోర్నమెంట్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కబడ్డీ పోటీలలో విన్నర్ రుద్రూర్, రన్నర్ రుద్రూర్ జట్లు విజయం సాధించాయి. ఖో–ఖో పోటీలలో విన్నర్ రుద్రూర్, రన్నర్ –రుద్రూర్గా నిలిచాయి. వాలీబాల్ పోటీలలో విన్నర్ –సులేమాన్ నగర్, రన్నర్ –రుద్రూర్ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు గెలుపొందారు. క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు, విద్యార్థినులకు గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ చేతుల మీదుగా సీఎం కప్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలగంగాధర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం జనవరి 31, 2026

# వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- ఎంపీడీవో పొన్నూరు శ్రీనివాసరావు



**వేద న్యూస్, కారేపల్లి:**

రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సింగరేణి మండల ఎంపీడీవో పొన్నూరు శ్రీనివాసరావు అధి కారులను, సర్పంచులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఖమ్మం జిల్లా సిం గరేణి మండల పరిధిలోని గాదెపాడు, ఎర్రబోడు, మాణిక్యారం గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లోని తాగునీటి వనరులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీడీవో, అనంతరం సర్పంచులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు సరఫరా అయ్యే తాగునీటిని వృథా చేయకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే బోర్లు, మోటార్లు, పైప్‌లైన్లలో లోపాలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. తాగునీరు ప్రజలకు కనీస అవసరమని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఆయన హెచ్చరించారు. వేసవి సవాళ్లను ఎదుర్కొనేందుకు యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో సర్పంచులు భూక్యా రంజిత్ కుమార్, ఈసాల అలివేలు మంగ, నాగేశ్వరావు, భూక్యా పద్మ వాచ్యతో పాటు స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# 27వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా రాకేష్ నామినేషన్

- జనసేన పార్టీ అభ్యర్థిగా బరిలో..
- యువతకు ప్రజలు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

**వేద న్యూస్, జమ్మికుంట:**




జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల్లో బరిలో జనసేన పార్టీ నుండి 27వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బొమ్మినేని రాకేష్ శుక్రవారం మున్సిపల్ ఆఫీసులో నామినేషన్ దాఖలు చేశారు. తన రాజకీయ ప్రవేశాన్ని అధి కారికంగా రాకేష్ ప్రకటించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరి ష్కారం కోసం పనిచేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, మహిళల సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. 27వ వార్డు ప్రజల నుంచి ఆయనకు మంచి స్పందన లభిస్తుండగా, ఈ పోటీతో వార్డు రాజకీయాల్లో కొత్త చైతన్యం కనిపిస్తోంది. 27వ వార్డు ప్రజలే తన కుటుంబ సభ్యులని, ప్రజలే తన బలం, బలగమని రాకేష్ పేర్కొన్నారు. వార్డు ప్రజల సమస్యలన్నింటినీ తాను చిత్తశుద్ధితో పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. ప్రతి పనికి తాను ముందు ఉంటానని, సేవకుడిగా కర్తవ్యం నిర్వహించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా యువతకు ప్రజలకు అవసరమైన అన్ని విషయాలపై తాను అవగాహన కలిగి ఉన్నానని, తనకు ఒకసారి అవకాశం ఇస్తే.. నాయకుడిగానే కాకుండా సేవకుడిగా ప్రతి ఒక్కరి పనిని తన భుజాల మీద వేసుకొని పూర్తి చేసే బాధ్యతను తీసుకుంటానని, తనను రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా గెలిపించాలని ప్రజలను వినమ్రంగా వేడుకున్నారు.

# సత్యం అహింస మార్గంలో నడిచిన మహా ప్రయాణం

- అహింసతో సామ్రాజ్యాన్ని సవాలు చేసిన నాయకత్వం
- నైతిక విలువలతో భారత స్వేచ్ఛా ఉద్యమం
- నేటి సమాజానికి గాంధీ ఆలోచనల ప్రాధాన్యం

**వేద న్యూస్ డెస్క్:**

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి భారత చరిత్రలో ఒక స్మరణీయ ఘట్టం. ఆయుధాలు లేకుండా, రక్తపాతం లేకుండా, కేవలం సత్యం, అహింస అనే సిద్ధాంతాలతో ఒక సామ్రాజ్యాన్ని ఎదుర్కొన్న అరుదైన నాయకుడు గాంధీ. ఆయన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని కొత్త దిశలో నడిపించింది. రాజకీయ స్వేచ్ఛ మాత్రమే కాదు, నైతిక స్వేచ్ఛ కూడా సాధించాల్సిన అవసరం ఉందని ఆయన దేశానికి బోధించారు.

గాంధీ చూపిన అహింస మార్గం బలహీనత కాదని, అది అసాధారణ శక్తికి ప్రతీక అని ఆయన జీవితం నిరూపించింది. అసహకార ఉద్యమం, సత్యాగ్రహం, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల ద్వారా కోట్లాది మందిని ఏకతాటిపై నిలిపారు. ప్రజలలో దాగి ఉన్న ధైర్యాన్ని వెలికి తీసి, సామూహిక చైతన్యంగా మార్చడంలో గాంధీ అసాధారణ విజయాన్ని సాధించారు. ఈ పోరాటం ప్రపంచ దేశాలకు కూడా ప్రేరణగా మారింది.

గాంధీ జీవితం సాదాసీదాగా ఉన్నప్పటికీ, ఆలోచనలు ఎంతో విశాలమైనవి. ఆయన వ్యక్తిగత జీవితం, ప్రజా జీవితం మధ్య ఎలాంటి విభేదం ఉండేది కాదు. చెప్పిన మాటను తన జీవితంలో ఆచరించడం గాంధీ ప్రత్యేకత. నిజాయితీ, సరళత, ఆత్మ నియంత్రణ, నైతికత వంటి విలువలు ఆయన ప్రతి చర్యలో కనిపించేవి. ఇవే ఆయనను సాధారణ నాయకుడి నుంచి మహనీయుడిగా నిలబెట్టాయి.

స్వాతంత్ర్యం సాధించిన తరువాత కూడా గాంధీ కలగన్న భారతదేశం కేవలం రాజకీయ స్వేచ్ఛతో పరిమితమయ్యేది కాదు. పేదరికం లేని సమాజం, కులమత విభేదాలు లేని దేశం, భయం లేని జీవితం గాంధీ ఆశయం. కానీ నేటి పరిస్థితుల్లో పెరుగుతున్న అసహనం, హింస, ద్వేష రాజకీయాలు గాంధీ కలలకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ఈ సందర్భంలో గాంధీ ఆలోచనలను తిరిగి స్మరించుకోవడం అత్యవసరం.

నేటి తరం ఎదుర్కొంటున్న సమస్యలకు గాంధీ సిద్ధాంతాలు పాతబడినవి కావు. వ్యక్తిగత స్థాయిలో

గాంధీ చూపిన మార్గం కాలాతీతమైనది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికత, జీవన విధానాలు మారవచ్చు. కానీ సత్యం, అహింస, మానవత్వం వంటి విలువలు ఎప్పటికీ మారవు. ఆ విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగినప్పుడే గాంధీ కలగన్న భారతదేశం సాకారం అవుతుంది. గాంధీ వర్ధంతి ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరికి మళ్లీ గుర్తుచేసే సందర్భం. నేటి కాలంలో పెరుగుతున్న హింస, అసహనం, విభేదాల మధ్య గాంధీ ఆలోచనలు మరింత అవసరమని వ్యాఖ్యానించారు. సమస్యలకు హింసే పరిష్కారమనే భావనకు గాంధీ సిద్ధాంతాలు గట్టి ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం పెంపొందాలంటే గాంధీ చూపిన సత్యఅహింస మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని సూచించారు.

జీవితాల్లో ప్రతిఫలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత ప్రవర్తనలో నిజాయితీ, సామాజిక జీవితంలో సహనం, ప్రజా వ్యవహారాల్లో న్యాయం పాటించినప్పుడే గాంధీకి నిజమైన . గాంధీ ఆశించిన భారతదేశం భయం లేని, న్యాయం ఉన్న, మానవత్వం విలసిల్లే సమాజమని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా గాంధీ వర్ధంతిని 'అమరవీరుల సంస్మరణ దినం'గా నిర్వహిస్తూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేటి స్వేచ్ఛా భారతం రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగ స్ఫూర్తిని తరతరాలకు అందించడం, దేశం కోసం బాధ్యతగా జీవించడం ప్రతి పౌరుడి కర్తవ్యమని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# 24వ వార్డులో మార్పు రాజకీయాలకు శ్రీకారం

- కౌన్సిలర్ అభ్యర్థిగా అరికిల్ల స్రవంతి భానుచందర్ నామినేషన్




**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి కాలనీ 24వ వార్డులో మున్సిపల్ ఎన్నికలు రోజు రోజుకీ రాజకీయంగా వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అరికిల్ల స్రవంతి భానుచందర్ శుక్రవారం నామి నేషన్ పత్రాలు సమర్పించడంతో ఎన్నికల సమీకరణలు మారుతున్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నామినేషన్ అనంతరం స్రవంతి మాట్లాడుతూఇన్నాళ్లుగా పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి దూరమైన 24వ వార్డులో ఈసారి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఎన్నికల సమయం వచ్చినప్పుడు మాత్రమే కనిపించే నాయకత్వానికి ప్రజలు విసిగిపోయారని, వార్డు ప్రజలకు అవసరమైనది మాటలు కాదు పనిచేసే ప్రతినిధి అని ఆమె పరోక్షంగా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. కాలనీలోని తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం వంటి సమస్యలు సంవత్సరాలుగా అలాగే ఉండిపోయాయని అన్నారు. ప్రజల మధ్యే ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడే నాయకత్వమే కాంగ్రెస్ పార్టీదని ఆమె చెప్పారు. ప్రజల ఓటు హక్కును నిర్లక్ష్యం చేసిన వారికే ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పబోతున్నారని, అభివృద్ధి కోసం నిజంగా కృషి చేసే వారికే మద్దతు లభిస్తుందని స్రవంతి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో వ్యక్తిగత లాభాల కోసం రాజకీయాలు చేసే శక్తులకు కాకుండా, ప్రజా సంక్షేమాన్ని ముందుకు నడిపించే 'చేతి గుర్తు'కు ఓటు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. భారీ మెజారిటీతో గెలిపిస్తే 24వ వార్డును అభివృద్ధిలో ముందుండే వార్డుగా మార్చుతానని హామీ ఇచ్చారు. నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు తెలిపారు. 24వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి బరిలోకి దిగడంతో ప్రతిపక్షాల్లో చర్చ మొదలైందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రజాసేవలో అంబాల స్వప్న రజనీకాంత్

- సోషల్ సర్వీస్ కు ప్రయారిటీ
- నలుగురికి మంచి చేయాలనే ఆశయ సాధనలో నిమగ్నం

**వేద న్యూస్, జమ్మికుంట:**

"మనం చేసే పనిలో మంచి కనపడాలి కానీ, మనిషి కనపడనక్కర్లేదు" అని ఓ చిత్రంలో కథానాయకుడు చెప్పిన మాటలు వారికి అక్షరాలా సరిపోతాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. హంగు, ఆర్భాటాలకు అంతగా ప్రాధాన్యతను ఇవ్వకుండా పనిని సమర్థవంతంగా పూర్తి చేయడానికి వారు ఇష్టపడతారు. సామాజిక సేవకుడిగా, ప్రజాసేవలో వారు బలమైన అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్నారు. వారే జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గ్రామ ఉప సర్పంచ్ అంబాల స్వప్న రజనీకాంత్.

**సేవామార్గం**

ఉన్నత విద్యావంతుడు అంబాల రజనీకాంత్.. బ్లడ్ డొనేషన్స్ చేయడంతో పాటు రక్తదానంపై విస్తృత అవగాహన కల్పిస్తూ..బాధ్యత గల పౌరుడిగా ప్రతీ ఒక్కరూ ఉండాలని భావించే వ్యక్తి. ఆహారవృథాపైన సైతం ఆయన అవగాహన కల్పిస్తూ.. అన్నార్తులకు భోజనం అందించే కార్యక్రమాలు చేపడుతూ..సేవా పథంలో ముందుకు సాగుతున్నారు. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ అగ్రికల్చర్ ప్రైవేటు ఎంప్లాయీస్ యూనియన్ జమ్మికుంట మండల అధ్యక్షుడిగా రజనీకాంత్ ఉన్నారు. తన మిత్రుడి 12 రోజుల కుమారుడికి బీ పాజిటివ్ రక్తం కావలసి ఉండగా, దానికోసం ఎంత ప్రయత్నం చేసినా దొరకలేదని.. బ్లడ్ లేక ఆ బాలుడు ప్రాణాలు కోల్పోయాడని, అప్పుడే రక్తం విలువ తనకు తెలిసిందని అంబాల రజనీకాంత్ తెలిపారు. సదరు ఘటనతో తన మదిలో ఎలాగైనా ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించాలని ఆలోచన కలిగిందని, అలా 'పునర్జన్మ' పేరిట వాట్సాప్ గ్రూప్ ద్వారా ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి వందలాది మందికి రక్తదానం చేస్తున్నానని వివరించారు. అత్యవసర సమయంలో ప్రాణదాతగా నిలిచే బ్లడ్‌ను డొనేట్ చేయడం ద్వారా కలిగే లాభాలను ఆయన యువతకు చెబుతూ.. అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే 'పునర్జన్మ' గ్రూప్ ద్వారా అవస రమైన వారికి వీలయినంత త్వరగా బ్లడ్ డొనేషన్ కోసం డోనార్స్‌ను పంపించి.. ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటున్నారు.



**అనాథల ఆత్మ బంధువు**

మాటలు చెప్పి...ఆచరణలో మరొకటి చేసే వ్యక్తిగా కాకుండా.. ఏదైతే చెబుతారో.. అదే ఆచరణలో చేసే నైజం అంబాల రజనీకాంత్ సొంతం అని చెప్పొచ్చు. ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తూ..వ్యవసాయం చేసుకుంటూ.. తన సొంత నిధుల నుంచి సేవా కార్యక్రమాలను చేప డుతున్నట్టు వెల్లడించారు. ఎలాంటి అవినీతి, మరొకరి నుంచి డబ్బులు తీసుకొచ్చే ఆలోచన లేకుండా.. సొంతంగానే తనకు తోచినంతలో శాయశక్తులా సేవా కార్యక్రమాలను చేస్తున్నట్టు తెలిపారు. జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి స్పందన అనాథాశ్రమంలోని సుమారు 30 మంది పిల్లలకు ప్రతీ సంవత్సరం తెలుగు నూతన సంవత్సరాది ఉగాది వేళ కొత్త బట్టలను అందిస్తున్నారు. వారితోనే కలిసి తన జన్మదిన వేడుకలనూ నిర్వహించుకుంటున్నారు. రాఖీ పౌర్ణమి సెలబ్రేషన్స్ కూడా చేసు కుంటున్నారు. సామూహిక బర్త్ డే సెలబ్రేషన్స్ కూడా నిర్వహిస్తామని రజనీకాంత్ చెప్పారు. తనకు పదవులపై కాంక్ష లేదని, ప్రజాసేవలోనే నిమగ్నమై..అంకితభావంతో ముందుకు సాగుతానని చెబుతున్నారు. తన సొంతూరులో తనుగుల సేవా సమితి వ్యవస్థాపకుడిగా పలు కార్యక్రమాలను ఆయన చేపట్టారు.

# అంబరాన్నంటిన క్రీడా సంబురం

- స్మార్ట్ కిడ్జ్ లో.. - స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన జిల్లా క్రీడా అధికారి సునీల్ రెడ్డి.

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం క్రీడా సంబురాలు అంబరా న్నంటాయి. పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య పర్యవేక్షణలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ విద్యార్థుల క్రీడా నైపుణ్యాల కు నిదర్శనంగా నిలిచా యి. తొలుత ముఖ్య అతిథి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి తుంబూరు సునీల్ రెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డి ఎస్ డి ఓ సునీల్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తితో అన్ని రంగాలలో ఉన్నత స్థాయిలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించడానికి పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ పట్ల అభినందనలు తెలిపారు. గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి క్రీడా పోటీలలో పతకాలు సాధించడం హర్షనీయమన్నారు. పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. విద్యార్థుల క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా వార్షిక స్పోర్ట్స్ మీట్ ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థులు దాదాపు 270 మంది వివిధ పోటీలలో తమ సత్తా చూపుతున్నారని పేర్కొన్నారు. చదువుతోపాటు అన్ని రంగాలలో తమ పాఠశాల విద్యార్థులను ఉన్నతంగా రాణించేలా తీర్చిదిద్దుతున్నామని తెలియజేశా రు. అనంతరం విద్యార్థులకు వివిధ క్రీడలలో నిర్వహించిన పోటీలలో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొ న్నారు. ఈ స్పోర్ట్స్ మీట్ కార్య క్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సి పాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.



# 11వ వార్డు కౌన్సిలర్ గా సత్యవతి నామినేషన్

**వేద న్యూస్, మరిపెడ :**

మరిపెడ మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో భాగంగా 11వ వార్డ్ ఎస్టి జనరల్ కావడంతో 11వ వార్డుకు చెందినబాషిపంగు యుగేందర్ భార్య లావుడియా సత్యవతి నామినేషన్ శుక్రవారం దాఖలు చేశారు. వారు గులాబీ పార్టీలో చేరి నామినేషన్ వేశారు. కార్యక్రమంలో 11వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ ఏడేలీ పరశురాములు , భాష్పంగు ఉప్పలమల్లు, సైదులు, మాంజా, బానోత్ వెంకన్న, బానోత్ వీరన్న, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వేద న్యూస్
శనివారం జనవరి 31, 2026

# అల్లు అర్జున్ జోడీగా శ్రద్ధా కపూర్..

## – లోకేష్ భారీ ప్లాన్.. డబుల్ సెన్సేషన్..!



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు కోలీవుడ్ సెన్సేషనల్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే ప్రతిష్టాత్మక చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఏఏ23 వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో కథానాయికగా బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్‌ను ఎంపిక చేసినట్లు వినిపిస్తున్న వార్తలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల భారీ విజయాన్ని అందుకున్న శ్రద్ధా కపూర్ ఇప్పటికే ప్రభాస్‌తో కలిసి నటించిన అనుభవం ఉండటంతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. ఇప్పుడు అల్లు అర్జున్ సరసన నటించే అవకాశం దక్కితే టాలీవుడ్‌లో మరోసారి సెన్సేషన్ ఖాయం అనే టాక్ వినిపిస్తోంది. లోకేష్ కనగరాజ్ సినిమాల్లో సాధారణంగా హీరో క్యారెక్టర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందన్న అభిప్రాయం ఉన్నప్పటికీ, ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర చాలా కీలకంగా, బలమైన ప్రాధాన్యంతో ఉంటుందని సమాచారం. ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాతో బిజీగా ఉన్నాడు. ఆ సినిమా పూర్తైన తర్వాత లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్‌పై పూర్తి దృష్టి పెట్టనున్నాడు. ఈ చిత్రం లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగమా లేక ప్రత్యేకంగా రూపొందించే స్వతంత్ర చిత్రమా అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అయినప్పటికీ అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్, శ్రద్ధా కపూర్ కాంబినేషన్ ఖరారైతే బాక్సాఫీస్ వద్ద భారీ అంచనాలు నెలకొనడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఓటీటీలోకి ప్రభాస్ 'ది రాజాసాబ్'.. తేదీ ఫిక్స్!




**వేద న్యూస్ డెస్క్:**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో తెరకెక్కిన హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్' ఓటీటీలోకి రానుంది. థియేటర్లలో విడుదలై మిక్స్‌డ్ స్పందన తెచ్చుకున్న ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. చిత్ర విడుదలైన నెల రోజుల్లోపే ఓటీటీ స్ట్రీమింగ్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్ర డిజిటల్ హక్కులను భారీ ధరకు జియో హాట్‌స్టార్ సొంతం చేసుకోగా, ఫిబ్రవరి 06 నుంచి తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ ప్రారంభం కానుంది. ప్రభాస్‌ను వింటేజ్ లుక్‌లో చూపిస్తూ మారుతి రూపొందించిన ఈ సినిమాలో సంజయ్ దత్, మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ కీలక పాత్రల్లో నటించారు. కథ విషయానికి వస్తే రాజు అలియాస్ రాజాసాబ్‌కు అమ్మానాన్నలకంటే నాయనమ్మ గంగాదేవే లోకం. ఆల్జీమర్స్‌తో బాధపడుతున్న గంగాదేవి అన్ని విషయాలు మర్చిపోయినా, ఎన్నేళ్ల క్రితం విడిచిపెట్టి వెళ్లిపోయిన భర్త కనకరాజును మాత్రం మర్చిపోదు. తాత కోసం వెతుకుతున్న రాజుకు నర్సాపూర్ అడవుల్లో ఉన్న ఓ పురాతన రాజమహల్ గురించి తెలుస్తుంది. ఆ మహల్‌లో అడుగుపెట్టిన తర్వాత రాజు ఎదుర్కొన్న అనుభవాలు, కనకరాజు గత రహస్యాలు, గంగాదేవి జీవితంలో దాగి ఉన్న నిజాలు, నాయనమ్మ కోసం రాజు చేసిన పోరాటమే ఈ చిత్ర కథాంశం. ఇప్పుడు థియేటర్ మిస్ అయిన ప్రేక్షకులు, మరోసారి చూడాలనుకునే అభిమానులు ఓటీటీలో ఈ సినిమాను ఆస్వాదించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రజినీకమల్ మల్టీస్టారర్ మళ్లీ హాట్ టాపిక్..



**వేద న్యూస్ డెస్క్:**

భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన భారీ చిత్రాల ట్రెండ్ కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. ముఖ్యంగా అగ్ర కథానాయకులు కలిసి నటిస్తే ఆ ప్రాజెక్ట్ విడుదలకు ముందే విపరీతమైన హైప్ ఏర్పడుతోంది. అలాంటి అత్యంత క్రేజీ కాంబినేషన్‌గా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా మరోసారి చర్చకు వచ్చింది. గతంలో ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ చేయబోతున్నారన్న వార్తలు సంచలనం సృష్టించాయి. తాజాగా ఆ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై మళ్లీ ఊపు వచ్చిందని తమిళ సినీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ భారీ చిత్రాన్ని జైలర్ సినిమాతో సంచలన విజయాన్ని అందుకున్న దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్లు గట్టి ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలకు బలం చేకూర్చేలా, రజినీకాంత్ కమల్ హాసన్ కలయికలో రూపొందబోయే సినిమాకు సంబంధించి ఒక ప్రత్యేక విజువల్ లేదా అనౌన్స్మెంట్ కట్‌ను నెల్సన్ ఇప్పటికే సిద్ధం చేస్తున్నాడన్న టాక్ కూడా నడుస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువేనని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ జైలర్ రెండో భాగంతో పాటు ఇతర చిత్రాల పనుల్లో బిజీగా ఉండటంతో, అవి పూర్తైన తర్వాతే ఈ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే ఛాన్స్ ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

# పేరు మార్చుకోనున్న సమంత..?



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. గత ఏడాది డిసెంబర్ నెలలో బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. అత్యంత సన్నిహితుల మధ్య కోయంబత్తూర్‌లోని ఈషా ఫౌండేషన్‌లో, సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆశీస్సులతో ఈ వివాహం సాదాసీదాగా జరిగింది. వివాహం తర్వాత కూడా సమంత తన సినీ కెరీర్‌లో చురుగ్గా కొనసాగుతూ కొత్త చిత్రాలపై దృష్టి పెట్టారు. ఇదిలా ఉండగా, సమంత తన పేరులో మార్పు చేసుకోనున్నారన్న వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సమంత అసలు పేరు సమంత రూత్ ప్రభు. తాజాగా రాజ్ నిడిమోరుతో వివాహం అనంతరం, తన భర్త ఇంటిపేరును తన పేరు చివర చేర్చుకోవాలని ఆమె నిర్ణయించుకున్నట్టు సమాచారం. దీంతో ఇకపై ఆమె పేరు సమంత నిడిమోరుగా మారే అవకాశముందని తెలుస్తోంది. ప్రస్తుతం సమంత 'మా ఇంటి బంగారం' చిత్రంలో నటిస్తున్నారు. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రాజ్ నిడిమోరు క్రియేటర్‌గా, సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా టైటిల్స్‌లో సమంత పేరు సమంత నిడిమోరుగా కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఆస్ట్రేలియా ఓపెన్ 2026 ఫైనల్లోకి కార్లోస్ అల్కరాజ్



**వేద న్యూస్ డెస్క్:**

ఆస్ట్రేలియా ఓపెన్ 2026 తుది దశకు చేరుకుంది. ప్రపంచ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్ తన జోరును కొనసాగిస్తూ ఫైనల్‌కు అర్హత సాధించాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై హోరాహోరీ పోరులో 6-4, 7-6(5), 6-7(3), 6-7(4), 7-5 తేడాతో అల్కరాజ్ విజయం సాధించాడు. తొలి రెండు సెట్లలో ఆధిక్యం సాధించిన అల్కరాజ్‌పై జ్వెరెవ్ గట్టి పోటీ ఇచ్చి తదుపరి రెండు సెట్లను టైబ్రేక్‌లో దక్కించుకున్నాడు. నిర్ణయాత్మక ఐదో సెట్‌లో 3-5తో వెనుకబడిన అల్కరాజ్ అద్భుతంగా పుంజుకుని మ్యాచ్‌ను తనవైపు తిప్పుకున్నాడు. మూడో సెట్‌లో కుడి కాలికి గాయం కావడంతో అల్కరాజ్ కదలికల్లో ఇబ్బంది పడ్డాడు. మెడికల్ టైమ్ అవుట్ తీసుకున్నప్పటికీ మ్యాచ్‌ను వదలకుండా పోరాడి విజయం సాధించడం అభిమానులను ఉత్సాహపరిచింది. ఆదివారం జరిగే ఫైనల్లో అల్కరాజ్ రెండు సార్లు డిఫెండింగ్ ఛాంపియన్ జానిక్ సినర్ లేదా నోవాక్ జోకోవిచ్‌లలో ఎవరో ఒకరితో తలపడే అవకాశం ఉంది.

# సంజూ శాంసన్‌కు లాస్ట్ చాన్స్... ఈసారి ఫెయిలైతే కష్టమే!




**వేద న్యూస్ డెస్క్:**

భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే సిరీస్‌ను ఖాయం చేసుకున్న భారత జట్టు, శనివారం జరిగే ఆఖరి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 4-1 తేడాతో ఘనంగా ముగించాలని పట్టుదలగా ఉంది. అయితే ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి మాత్రం కేరళ కుర్రాడు సంజూ శాంసన్‌పైనే కేంద్రీకృతమైంది. సొంతగడ్డపై జరుగుతున్న ఈ పోరు అతనికి అత్యంత కీలకంగా మారింది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు సంజూ శాంసన్ పూర్తిగా నిరాశపరిచాడు. ఓపెనర్‌గా అవకాశాలు లభించినప్పటికీ నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 40 పరుగులు మాత్రమే చేసి విమర్శల పాలయ్యాడు. శుభ్‌మన్ గిల్‌పై వేటు వేయడంతో వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోవడం అతనికి పెద్ద మైనస్‌గా మారింది. ఇప్పుడు సొంత ప్రేక్షకుల మధ్య ఆడుతున్న ఈ మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడితేనే తనపై ఉన్న ఒత్తిడిని తగ్గించుకోగల పరిస్థితి ఉంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ దృష్ట్యా ఈ మ్యాచ్ సంజూ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారనుంది. ఈ మ్యాచ్‌లోనూ విఫలమైతే తుది జట్టులో అతని స్థానంపై తీవ్ర సందేహాలు నెలకొనే అవకాశముంది. ఇదే సమయంలో తుది జట్టులోకి ఇషాన్ కిషన్, వరుణ్ చక్రవర్తి తిరిగి వచ్చే అవకాశాలు ఉండటంతో సంజూపై ఒత్తిడి మరింత పెరిగింది. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం భారత్‌కు అనుకూలంగా ఉంది. ఇక్కడ ఆడిన నాలుగు టీ20 మ్యాచ్‌లలో మూడు విజయాలు భారత్ ఖాతాలో ఉన్నాయి. ఈ మైదానంలో తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 155 పరుగులు కాగా, గతంలో 235 పరుగుల భారీ స్కోరు కూడా నమోదైంది. ఈ గణాంకాలు భారత జట్టుకు సానుకూలంగా ఉన్నాయి. ఒకవైపు సిరీస్‌ను విజయంతో ముగించి ప్రపంచకప్ ముందు ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని భారత్ భావిస్తుండగా, మరోవైపు కనీసం చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పర్యటనను గౌరవప్రదంగా ముగించాలని న్యూజిలాండ్ ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం జరగబోయే ఈ మ్యాచ్ సంజూ శాంసన్ భవితవ్యాన్ని నిర్ణయించే పోరుగా మారింది.

# కేరళలో పద్మనాభస్వామి ఆలయాన్ని దర్శించిన టీమిండియా సభ్యులు



**వేద న్యూస్ డెస్క్:**

న్యూజిలాండ్‌తో జరగనున్న చివరి టీ20 మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ జట్టు సభ్యులు కేరళలోని చారిత్రక శ్రీ పద్మనాభస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో స్వామివారి సన్నిధికి చేరుకున్న ఆటగాళ్లు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో పాటు ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, బ్యాటర్ రింకు సింగ్, స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ ఆలయ దర్శనంలో పాల్గొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత్ ఇప్పటికే 31 ఆధిక్యంతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. అయితే నాలుగో మ్యాచ్‌లో ఓటమి పాలైన నేపథ్యంలో చివరి పోరులో గెలిచి సిరీస్‌ను ఘనంగా ముగించాలని జట్టు పట్టుదలగా ఉంది. ఈ సిరీస్ ఆరంభం నుంచే భారత ఆటగాళ్లు వివిధ ప్రాంతాల్లో ఆలయాలను సందర్శిస్తూ వస్తున్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన మ్యాచ్‌కు ముందు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని కూడా దర్శించుకున్నారు. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న 2026 టీ20 ప్రపంచకప్‌కు సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్ కొనసాగుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్, ఈ టోర్నీలో తన తొలి మ్యాచ్‌ను అమెరికాతో ఆడనుంది.

# గంభీర్ నిర్ణయాలపై బ్రియాన్ లారా సంచలన వ్యాఖ్యలు



**వేద న్యూస్ డెస్క్:**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకుంటున్న నిర్ణయాలపై విమర్శలు మరింత తీవ్రమవుతున్నాయి. తాజాగా వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా కూడా గంభీర్ నిర్ణయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. గంభీర్ నిర్ణయాలు భారత క్రికెట్‌కు ప్రమాదకరంగా మారుతున్నాయని, ఇవి జట్టుకు మేలు చేయడం లేదని లారా స్పష్టం చేశారు. గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత టెస్టు, వన్డే ఫార్మాట్లలో భారత జట్టు ప్రదర్శన గణనీయంగా పడిపోయిందని లారా విమర్శించారు. టీ20 ఫార్మాట్‌లో మాత్రమే భారత్ కొంత మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ, అక్కడ కూడా జట్టు సమష్టి కృషి కంటే వ్యక్తిగత ప్రతిభపైనే విజయాలు ఆధారపడి ఉన్నాయని వ్యాఖ్యానించారు. రాబోయే టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు జట్టుగా విఫలమైతే కీలక మ్యాచ్‌ల్లో తప్పక ఓటములు ఎదుర్కోవాల్సి వస్తుందని లారా హెచ్చరించారు. ఈ టోర్నీతోనే భారత జట్టులో ఉన్న అసలు సమస్యలు బయటపడతాయని అన్నారు. ఒకప్పుడు భారత జట్టును ఓడించేందుకు ప్రత్యర్థి జట్లు ఎన్నో వ్యూహాలతో వచ్చేవని, ఇప్పుడు మాత్రం ఏ జట్టైనా సులభంగా వైట్‌వాష్ చేస్తోందని లారా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత క్రికెట్‌ను కాపాడాలంటే గంభీర్‌ను తప్పించాల్సిన అవసరం ఉందని, ఆలస్యం చేస్తే పరిస్థితి మరింత చేదుగా మారుతుందని ఆయన సూచించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073